# రెండు లారీలు ఢీ - డ్రైవర్లకు తీవ్ర గాయాలు



గుడిపాల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: మండల పరిధిలోకి చిత్తూరు-చెన్నై జాతీయ రహదారి చీలాపల్లి ఆసుపత్రి సమీపంలో గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొనడంతో రెండు లారీల డ్రైవర్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఎస్ఐ రామ్మోహన్ వివరాల మేరకు.. చెన్నై నుండి చిత్తూరు వైపుకు వస్తున్న ఓ కంటైనర్‌ను చిత్తూరు నుండి చెన్నై వైపుకు వెళ్తున్న కంటైనర్ అతి వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఈ ప్రమాదంలో రెండు కంటైనర్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. ఒక కంటైనర్ డ్రైవర్ కాళీశ్వరన్(35) తీవ్రంగా గాయపడగా మరొక కంటైనర్ డ్రైవర్ మరియప్పం(50) సైతం తీవ్రంగా గాయపడ్డారన్నారు. వీరిద్దరిని చికిత్స నిమిత్తం సమీపంలోని చీలాపల్లి సిఎంసి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# రాహుకేతు పూజలు జరుపుకున్న పూజా హెగ్డే



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను ప్రముఖ సినీ నటి పూజా హెగ్డే కుటుంబసభ్యులతో కలసి జరిపించుకున్నారు. ఆమె ఆలయానికి రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు స్వాగతం పలికారు. హెగ్డే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ఆలయ పిఆర్ఓ రవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు వెంటనే ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజలురూ.5వేల టిక్కెట్టు కొని సహస్రలింగేశ్వరుని ఆలయం వద్దవేదపండితులచే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం చేసుకున్నారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

# సీనియర్లపై జూనియర్ డాక్టర్ పెత్తనం!

## ఎఫ్‌ఆర్ఎఎస్ పేరిట వేధింపులు - జిల్లా వైద్య ఆరోగ్య శాఖపై సీనియర్ డాక్టర్లు, సిబ్బంది తిరుగుబాటుకు సిద్ధం



చిత్తూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: వైద్య ఆరోగ్య శాఖ సర్వీసులో పాతికేళ్ళ సీనియర్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కొంతమంది డాక్టర్లు ప్రస్తుతం ఆ శాఖలో మూడేళ్ళ క్రితం జూనియర్‌గా చేరిన ఓ డాక్టర్ పెత్తనం చెలాయిస్తూ వేధిస్తుండటంతో సీనియర్ వైద్యులు, సిబ్బంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖపై తిరుగుబాటుకు సిద్ధం అవుతున్నారు. ఓ సీనియర్ డాక్టర్ తమను ఓ మాట అన్నా ఫర్వాలేదని, శాఖలో జూనియర్‌గా చేరిన ఆ డాక్టర్ తమపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి లేనివి పోనివి చెప్పి తమకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం, ఛార్జ్‌మెమోలు ఇప్పించడంతో శాఖలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ వైద్యులు మండిపడుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆ జూనియర్ డాక్టర్‌కు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టం(ఎఫ్‌ఆర్ఎఎస్)కు ఇన్‌ఛార్జ్‌గా నియమించడమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ప్రస్తుత చిచ్చుకు ముఖ్య కారణంగా చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం నెలకు ఒక డాక్టర్‌కు లక్షల రూపాయల జీతాలు వెచ్చించి క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సమాజం నిర్మించడానికి సిద్ధమవుతుంది. అయితే ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం క్షేత్ర స్థాయిలో డాక్టర్లుగా విధులు నిర్వర్తించాల్సిన కొంతమంది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రధాన అధికారులను మచ్చిక చేసుకుని క్షేత్ర స్థాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులకు వెళ్ళకుండా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కాలం వెళ్ళదీయడానికి సిద్ధం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇది వరకు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టం బాధ్యతలను డిఎంహెచ్ఓ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్లు, సూపరిటెండెంట్లు నిర్వర్తించేవారు. ప్రస్తుత డిఎంహెచ్ఓ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం మొత్తం తన గుప్పిట్లో పెట్టుకోవాలని భావించి తనకు అనుకూలమైన వారిని ఇక్కడ పనులు వున్నా లేకపోయినా డిప్యుటేషన్లపై నియమించుకోవడం ప్రారంభించడంతో వైద్య ఆరోగ్యశాఖలో చిచ్చు ప్రారంభమైంది. ఈ క్రమంలో పుంగనూరు లద్దిగం పిహెచ్‌సిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ జూనియర్ డాక్టర్‌ను ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టంకు డిప్యుటేషన్‌గా వేశారు. ఈయన రావడంతోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని పలువురు సీనియర్ డాక్టర్లకు వార్నింగ్‌లు ఇవ్వడం ప్రారంభించడంతో వారు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. విధుల హాజరులో కొద్దిపాటి ఆలస్యం జరిగినా ఈ విషయంను ఆ జూనియర్ డాక్టర్ పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం, ఈ ప్రాంతాల్లో డాక్టర్లు విధులకు హాజరు కావడం లేదనే సమాచారం ఇవ్వడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్ళి వారిని నిలదీయడం ప్రారంభిస్తుండటంతో ఒక్క సారి ఆలస్యమైతే ఇంత హంగామా చేయాలా! అని సీనియర్ వైద్యులు చిర్రుబుర్రులాడుతున్నారు. ఈ క్రమంలో డాక్టర్లు సైతం తాము ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టంకు సకాలంలో హాజరు కావడం లేదని ఆరుస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జూమ్ కాన్ఫరెన్స్‌ల పేరిట సాయంత్రం 6 గంటల వరకు డాక్టర్లను పిహెచ్‌సిల్లో వుండేలా చేయడంతో తాము రెండు, మూడు గంటల పాటు అదనంగా విధులు నిర్వర్తిస్తున్నామని ఉదయం కొద్దిపాటి ఆలస్యం అయితే మాత్రం తమను నిలదీయడం భావ్యం కాదని వాపోతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న పారా మెడికల్ సిబ్బంది పరిస్థితి ఇది కంటే అధ్వాన్నంగా వుంది. గత ప్రభుత్వంలో పిహెచ్‌సికి ఒకటి రెండు కిలో మీటర్ల దూరంలో వున్నప్పటికీ ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టం ద్వారా హాజరు వేసేవారు. ప్రస్తుతం పిహెచ్‌సిలోకి అడుగు పెడితేనే ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టం యాప్ పని చేస్తోంది. పారా మెడికల్ సిబ్బంది ఉదయం పిహెచ్‌సికి వెళ్ళి హాజరు వేసుకుని అక్కడి నుండి క్షేత్ర స్థాయి విధులకు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్య శాఖలో క్షేత్ర స్థాయి విధులు నిర్వర్తించే పారా మెడికల్ సిబ్బందికి ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టం మినహాయింపు ఇవ్వాలని యూనియన్లు కమీషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌తో పాటు ప్రభుత్వానికి పలు విన్నపాలు చేసినా ఫలితం లేకపోవడంతో వారి బాధ వర్ణనాతీతం అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ సిస్టంలో సీనియర్ డాక్టర్లపై జూనియర్ డాక్టర్ పెత్తనం చేస్తుండటంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖపై సీనియర్ డాక్టర్లు, పలు పారా మెడికల్ సిబ్బంది తిరుగుబాటుకు సిద్ధం అవుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దృష్టి కేంద్రీకరించి సరైన దిశగా చర్యలు తీసుకుంటారా! లేక వ్యవహారం ఇలానే నిర్వర్తిస్తూ సీనియర్ డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందితో తిరుగుబాటును ఎదుర్కొంటారా! వేచి చూడాలి.

# 'దివ్యరథం'పై కోదండరాముడు

## వేడుకగా రథోత్సవం

తిరుపతి(రవాణ),ఏప్రిల్ 3ప్రభాతవార్త



"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మవిద్యతే" ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తూ లోకాభిరాముడు శ్రీరామచంద్రుడు కోదండరాముడిగా సీతాలక్ష్మణఆంజనేయసమేతుడై ఊరేగాడు. తిరుపతి కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదవరోజు గురువారం ఉదయం స్వామివారి రథోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. ఉదయం 9.15గంటలకు సీతాలక్ష్మణసమేత కోదండరాముల వారు రథాన్ని అధిష్టించి నాలుగు మాఢవీధుల్లో విహరించారు. డప్పువాయిద్యాలు, భజన బృందాలు, కోలాటలు ఆడుతుండగా భక్తులు రథాన్ని లాగారు. అర్చకులు కర్పూరహారతులిచ్చి ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. ఆత్మరథికుడు, శరీరమే రథం. బుద్ధి సారధి, మనస్సు పగ్గం.ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంలో పోల్చడంతో స్థూలశరీరం వేరని, సూక్ష్మశరీరం వేరని,ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై ఊరేగారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఆలయ ఏఈఓరవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, భారీగా భక్తులు పాల్గొన్నారు.

### నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాలకు ముగింపుగా శుక్రవారం ఉదయం కపిలతీర్థం పుష్కరిణిలో చక్రస్నాన మహోత్సవం జరుగుతుంది. ఉదయం 9గంటల నుండి 10.30గంటల వరకు అర్చకులు జరిపిస్తారు.

# బాలాజీనగర్ వాసుల రక్షణ "కంచే" ఏదీ!?





తిరుమల,ఏప్రిల్ 3 ప్రభాతవార్తప్రతినిధి: శేషాచలంకొండల్లో తిరుమలపై స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్‌వాసులకు చిరుతపులులు, పాములు, ఎలుగుబంట్లు నుండి రక్షణకు కంచే ఏర్పాటు కలగానే మారింది. వన్యప్రాణుల బారి నుండి కాపాడటానికి బాలాజీనగర్‌చుట్టూ కంచే ఏర్పాటుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అంతేగాక స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూడా హామీ ఇచ్చారు. హామీ పదినెలలుగా నెరవేరదంలేదు. తిరుమలకొండపై ఏళ్ళతరబడి స్థిరపడిన....పలు రకాలుగా వ్యాపారాలు చేసుకుంటున్న స్థానికులు సుమారు ఐదువేల మందివరకు కాపురముంటున్నారు. ఇక్కడ 2వేలవరకు ఇళ్ళు ఉన్నాయి. ఈ ప్రాంతం శేషాచలంకొండలకు ఆనుకునే ఉండటంతో తరచూ చిరుతపులులు, ఎలుగుబంట్లు, విషసర్పాలు ఇళ్ళవద్దకు వచ్చేస్తున్నాయి. సాధారణంగా చిరుతపులులు తరచూ ఇటుగా వస్తుండటంతో స్థానికులు భయపడుతున్నారు. గత ఏడాది చిరుతపులులు సంచరించి స్థానికులను భయపెట్టాయి. చిరుతల బారి నుండి కాపాడటానికి, వన్యప్రాణులు బాలాజీనగర్ లోకి రాకుండా కంచే అవసరం ఉందనేది స్థానికుల విజ్ఞప్తి.

# ట్రాక్టర్ ట్రాలీ బోల్తా- 19 మంది ఉపాధి కూలీలకు గాయాలు

## న క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే, ఏపీడీ

విజయపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: విజయపురం మండలం పన్నూరు సమీపంలో పెళాసపాళెం రోడ్డులో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి 19 మంది ఉపాధి కూలీలకు రక్తగాయాలైన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని ఆమగుంట నుంచి ఉపాధిహామీ పనుల నిమిత్తం పన్నూరు అడవిలో పనులు చేయడానికి ట్రాక్టర్‌లో 20 మంది కూలీలు వెళ్లారు. మార్గమధ్యలో పన్నూరు దళితవాడ సమీపంలో పెళాసపాళెం రోడ్డులో ట్రాక్టర్ ఇంజన్ ముందు టైరు ఊడిపోవడంతో ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీలో ప్రయాణిస్తున్న 20 మందిఉపాధి కూలీల్లో 19 మంది గాయాలు కావడంతో 108 ద్వారా నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మాజీ ఎంపీటీసీ కాంతమ్మకు చేతి ఎముక విరగడం, అములు తలకు రక్త గాయాలు కావడంతో ఇద్దరిని తిరుపతి రుయాకు తరలించారు. మిగిలిన 17మందికి నగరి ఏరియా ఆస్పత్రిలోనే చికిత్స అందించారు.

### న మెరుగైన వైద్యం అందించండి - ఎమ్మెల్యే



ఉపాధి కూలీలను నగరి ఏరియా ఆస్పత్రిలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాషన పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. కూలీలు అందరూ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, ఉపాధి ఏపీడీ సునీల్‌కుమార్, ఎంపీడీవో రాజేంద్ర, ఏపీవో ధనయ్య, పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు.

# తిరుపతిరూరల్ గ్రామ సచివాలయాల్లో

# వరుస దొంగతనాలు

## -దుర్గసముద్రం సచివాలయంలో ముచ్చటగా మూడోసారి చోరీ



తిరుపతిరూరల్, ఏఫ్రిల్ 3, ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండల గ్రామ సచివాలయాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నా... తిరుపతిరూరల్ పోలీసులలో ఏలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. రూరల్ సచివాలయాల్లో ఫ్రింటర్స్ చోరీయే ఏజెండగా చేసుకుని దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. దుర్గసముద్రం గ్రామ సచివాలయంలో వరుసగా మూడోసారి ఫ్రింటర్ చోరీకి గురి కావడం ఆశ్చర్యాన్ని గురి చేస్తుంది. ఇదివరకు మల్లంగుంట, సి.గొల్లపల్లి గ్రామ సచివాలయాల్లో కంప్యూటర్స్‌తో పాటు ఫ్రింటర్స్‌ను తస్కరించారు. గ్రామ సచివాలయాల్లో వరుస దొంగతనాలతో బెంబేలు ఎత్తిస్తూ, దొంగలు తిరుపతిరూరల్ పోలీసులకు సవాల్ విసిరుతున్నారు. దుర్గసముద్రం గ్రామ సచివాలయంలో కంప్యూటర్స్ ఇతర సాంకేతిక సామాగ్రి ఉన్న కేవలం ఫ్రింటర్ మాత్రమే చోరీకి గురికావడంపై ఒకింత విస్మయానికి గురి చేస్తుంది. పంచాయతీ కార్యధర్శి నరసింహులు ఫిర్యాదు మేరకు తిరుపతిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, ధర్యాప్తు చేస్తున్నారు.

## మంచినీటి సమస్య నివారణపై

# అధికారుల్లో అప్రమత్తత అవసరం

## - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



వేసవి దృష్టా కుప్పం నియోజకవర్గంలో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్త కుండా అధికారులు అవసర మైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కడ కార్యాలయంలో కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఎంపిడిఒలు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లాలో భూగర్భజలాల నీటిమట్టం తగ్గుతోందని దీన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు, క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాటుచేయడంతో పాటు బాధ్యతాయుతంగా విధులు నిర వ్రహించాలన్నారు. అవసరమైన చోట్ల బోర్ల డీపెనింగ్ చేయడం, కొత్త బోర్లు వేయడం చేయాలన్నారు. పలుచోట్ల కొత్త బోర్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నీటిని సరఫరా చేయలేకపోతున్నట్లు కలెక్టర్‌కు అధికారులు వివరించారు. దీంతో ఆయన స్పందించి రెస్కో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపాలిటీ, మండలాల వారీగా మంచినీటి సమస్య పరిష్కారంకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు.

# తమ్మినపట్నంలో ఉద్రిక్తత

## పలు గ్రామాల రైతుల మధ్య తలెత్తిన విభేదాలు

చిల్లకూరు, ఏఫ్రిల్ 3, ప్రభాతవార్త



గూడూరు నియోజకవర్గం పరిధి లోని చిల్లకూరు మండలం తమ్మిన పట్నంలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. క్రిస్ సిటీ భూముల పరిహారం విషయంలో స్థానిక పలు గ్రామాల రైతుల మధ్య తలెత్తిన విభేదాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. తమకు న్యాయం చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కాన్వాయ్‌ను లింగవరం పంచాయతీ రైతులు అడ్డుకున్నారు. తమ్మినపట్నం ప్రాంతంలో పరిశీలనకు వచ్చిన జేసీ కాన్వాయ్ ముందు నేలపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. క్రిస్ సిటీ భూముల పరిహారం విషయంలో బినామీ పేర్లతో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ లింగవరం పంచాయతీ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ అధికారులను నిలదీశారు. ప్రతీ ఒక్కరికీ పరిహారం ఇవ్వాలని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పలు గ్రామాల రైతులతో చర్చించారు. ఈ క్రమంలో మరొకసారి పునః పరిశీలించి అర్హులైన వారికి పరిహారం అందేలా చూస్తామని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వెల్లడించారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో లింగవరం పంచాయతీ రైతులు శాంతించారు. ఆయన వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, పలువురు అధికారులు ఉన్నారు.

# నిశితంగా తనిఖీలు చేయండి : సివిఎస్ఒ

తిరుమల,ఏప్రిల్ 3ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల పుణ్యక్షేత్రంలో ప్రశాంతవాతావరణం, మరింత పవిత్రతగా ఉంచడంలో భక్తులు పూర్తిస్థాయిలో సహకరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్ఓ వి.హర్షవర్ధన్‌రాజు కోరారు. నిబంధనలు పాటించని యాత్రికులను, వారి వాహనాలను కొండకు అనుమతించొద్దని, మాట వినని వారిని తనిఖీలకు అతీతులు కాదన్నారు. విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ భక్తులతో సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్ఓ వి.హర్షవర్ధన్‌రాజు



ఆకస్మిక తనిఖీలు చేశారు. తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి,తిరుపతి డిఎస్పీ శ్రీలత, విఎస్ఓ సదాలక్ష్మి,అలిపిరి ఏవిఎస్ఓ ప్రభుతో కలసి ఆయన వాహనాలను అనుమతించే ప్రవేశ ద్వారాలను పరిశీలించారు.

# ఆస్తి గొడవల్లో నా భర్తను చంపి ఉరితాడుకు వేలాడదీసారు

## బాధితుని భార్య పోలీసులకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి రూరల్,ఏప్రిల్ 3 ప్రభాతవార్త

'ఆస్తి గొడవల్లో నా భర్తను చంపి పంట పొలాల్లో ఉరి తాడుకువేలాడ దీసారని బాధితుని భార్య భూలక్ష్మి గురువారం రూరల్ పోలీసులకు పిర్యాదు చేసారు. ఆమె ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయని సిఐ రవినాయక్ వివరించారు. శ్రీకాళహస్తి మండలం తొండనాడు పేట గ్రామంలో చిన్నబత్తిరెడ్డి(67) అనే జిజేలురెడ్డి నివాసముంటున్నారు. ఆయనకు భార్య,ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.ఇద్దరికి వివాహమైంది. కుమారునికి ఇద్దరు బిడ్డలు ఉన్నారు. తమ కుటుంబానికి దాయాదులు అయిన మహాదేవరెడ్డి కుమారుడు నరుష్‌తో వివాదాలున్నాయి. గ్రామంలోని మాకుటుంబానికి సంబంధించిన 12 సెంట్లు భూమికి సంబంధించి వివాదాలు ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉగాది కి ముందు రెండు రోజులు 4సెంట్ల ఇంటి స్థలాన్ని



చదును చేసుకుంటుండగా చిన్నబత్తిరెడ్డితో గొడవ పెట్టుకొని 'చంపేస్తామంటూ' హెచ్చరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం రాత్రి నుంచి తన భర్త కనబడటం లేదని గురువారం ఉదయం 5గంటలకు కల్లుగీత కార్మికులు చూసి సుబ్రమణ్యం అనే వ్యక్తి తమ ఇంటికి సమీపంలో కానగ చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతున్నాడని బంధువులకు తెలిపినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్థులు అందరూ అక్కడకు చేరుకొని పరిశీలించినట్లు వివరించారు.ఈ మేరకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. తన కుటుంబానికి న్యాయం చేయాలని భూలక్ష్మి కోరారు.దాంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సిఐ రవినాయక్ వివరించారు.

## శ్రీసిటీలో పెట్టుబడి అవకాశాలపై

# రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ పరిశీలన

సత్యవేడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్‌జేవ్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. కాన్సుల్ జనరల్, ఆయనతో పాటు విచ్చేసిన అధికారుల బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఇండో రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైందని రవీంద్ర సన్నారెడ్డి వాఖ్యనించారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైనట్లు గుర్తు చేసిన ఆయన, ఈ సందర్శన ఫలితంగా మరిన్ని రష్యన్ పరిశ్రమలు భారత మార్కెట్‌కు తమ ప్రధాన స్థావరంగా శ్రీసిటీని ఎంచుకుంటాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) ఆర్.శివశంకర్, ప్రజంటేషన్ ద్వారా శ్రీసిటీ మౌలికసదుపాయాలు, వేగవంతమైన అభివృద్ధి



గురించి కాన్సుల్ జనరల్‌కు వివరించారు. చర్చల సందర్భంగా శ్రీసిటీ గురించి వివిధ అంశాలపై ఆరా తీసిన రష్యన్ అధికారులు, శ్రీసిటీ ఏర్పాటు, ప్రభుత్వం అందించే వ్యాపార ప్రోత్సాహకాలు,ట్యాక్స్ మినహాయింపులు, కస్టమ్స్ విధానాలపై ప్రశ్నల ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్యాతో చర్చలు జరిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గణనాధుని సేవలో ఐఆర్ఎస్ అధికారులు

కాణిపాకం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని గురువారం ఇద్దరు ఐఆర్ఎస్ అధికారులు దర్శించుకున్నారు. ఈమేరకు కృష్ణ చైతన్య, హర్షిత దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్ పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకే బిల్లుకు తెలుగుదేశం మద్దతు

### - రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్

చిత్తూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:



రాష్ట్రంలోని ముస్లింల ప్రయోజనాలు, వక్ఫ్ ఆస్తులను పరిరక్షించుకోవడానికే వక్ఫ్ బిల్లుకు తెలుగుదేశం ప్రభుత్వం మద్దతు ఇచ్చిందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీలో తెలుగుదేశం పార్టీ మూడు సవరణలను ప్రతిపాదిస్తే మూడు సవరణలు ఆమోదించబడ్డాయన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ కమిటీల్లో ముస్లింలకే స్థానం, ప్రతినిధ్యం కల్పించడం జరుగుతుందన్నారు. ముస్లింల సమగ్ర అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి వుంటుందన్నారు. లోక్‌సభలో ఆమోదించబడిన వక్ఫ్ బిల్లుతో ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## పారిశుధ్య కార్మికుడి మృతికి మేయర్, కమీషనర్ నివాళులు

చిత్తూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:



చిత్తూరు నగర పాలకసంస్థ పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న కె.రామయ్య మృతికి గురువారం మేయర్ అముద, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లు నివాళులు అర్పించారు. మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు రామయ్య మృతదేహం ఐరాల మండలం మఠంపల్లి గ్రామంలోని ఆయన ఇంటి వద్ద వుండటంతో అక్కడికి వెళ్ళి రామయ్య పార్థివదేహంకు నివాళులు అర్పించి వారి కుటుంబసభ్యులను ఓదార్చి వచ్చారు. ఈ సందర్భంగా మేయర్, కమీషనర్‌లు ప్రభుత్వం తరపున మట్టి ఖర్చులకు 15 వేల రూపాయలను మృతి చెందిన రామయ్య కుటుంబసభ్యులకు అందజేశారు.

## అరగొండలో ఆకట్టుకున్న స్వచ్ఛ సర్వేక్షన్ కళాజాతా

తవణంపల్లె, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండలో గురువారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా అంటు వ్యాధుల గురించి అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కళాజాతా ఎంతో ఆకట్టుకుంది. మండల ఈఓపీఆర్డీ రాజేంద్రరాజు, స్థానిక గ్రామ కార్యదర్శి మురుగేవన్ ఆధ్వర్యంలో కళాకారులు అరగొండ కొత్త బస్టాండులో కళాజాతా నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింట చెత్త సేకరణ, తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయుట, దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలి ్పస్తూ ప్రదర్శనలిచ్చారు. గ్రామంలో చెత్తను ఎక్కడబడితే అక్కడ వీధుల్లో పడేయకుండా చెత్త బండి వచ్చినపుడు వారికి అందజేయాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు కళాజాతా ద్వారా సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మతి స్థిమితం లేని మహిళ అదృశ్యం

తవణంపల్లె, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:



మతి స్థిమితం లేని మహిళ అదృశ్యమైన సంఘటన మండలంలోని అరగొండలో బుధవారం చోటు చేసుకున్నట్లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అరగొండకు చెందిన అల్లాబక్ష్ భార్య జీనత్ అనే మహిళ గత పదేళ్ళుగా మతిస్థిమితం లేకుండా వుంది. ఈనేపథ్యంలో గత నెల 30 రంజాన్ పండుగ రోజున భర్త అల్లాబక్ష్ ఇంటిని శుభ్రం చేస్తుండగా భార్య జీనత్ ఉదయం అంగడికి వెళ్ళి వస్తానని చెపి ్ప ఇంటి నుండి వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అమరావతికి తరలిన తెదేపా సమన్వయకమిటీ బృందం

కుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ బృందం గురువారం అమరావతికి పయనమైంది. సిఎం చంద్రబాబునాయుడు శుక్రవారం సమన్వయకమిటీకి అపాయింట్‌మెంట్ ఖరారు చేసిన నేపథ్యంలో శుక్రవారం కుప్పం పార్టీ కీలక నేతలు ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారు. ప్రభుత్వ విప్, తెదేపా సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ నేతృత్వంలో సమన్వయ కమిటీ బృందం ముఖ్యమంత్రితో భేటీ కానుంది. కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, నామినేటెడ్ పదవులపై ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి.

## కొనసాగిన ఆర్టీసీ ఎన్ఎంయుఎ ఉద్యోగుల నిరసన



కుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

వివిధ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఎన్ఎంయుఎ ఉద్యోగులు స్థానిక డిపో కార్యాలయం ఎదుట డిపో అధ్యక్షుడు మునస్వామి, డిపో కార్యదర్శి జయపాల్ అధ్వర్యంలో రెండోరోజూ ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. దివంగత రామ్మోహనరావు ప్రవేశపెట్టిన ఎస్ఆర్‌బిఎస్ సంక్షేమ పథకం అమలు చేయాలన్నారు. గ్యారేజ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎఎస్ ఇంక్రిమెంట్లు, కిందిస్థాయి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతో పాటు ఇరవై ఏళ్ల సర్వీసు పూర్తయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేలు, డిపో ఛైర్మన్ బొట్టుమణి, వర్కింగ్ అధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ కార్యదర్శి మునెప్ప, నారాయణ, శ్రీను, ముస్తఫా, రమణ, రహంతుల్లా, దిలీప్, బాలకృష్ణ, అరుణ్, రాజా, చంద్రనాయక్, బ్రహ్మం, రమణ, నాయక్, నాగరాజ పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిలో రైతులు ఎంతో కీలకం

### - పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



రామకుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

పాడి పశువుల ద్వారా పాల ఉత్పత్తిలో రైతులు ఎంతో కీలకమని పొన్నూరు ఎమ్మెల్యే సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం బందార్లపల్లిలో సంగం సంస్థ తరపున నూతన డెయిరీని ఆయన ప్రారంభించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 21 పాల చిల్లింగ్ సెంటర్లు ప్రారంభించామన్నారు. ఐదు లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతోందన్నారు. 1977లో ప్రారంభించిన సంగం డెయిరీ రైతుల ఆర్థిక అభివృద్ధికై తగు సహకారం అందిసో ్తందన్నారు.రైతులకు చాపర్లు, మిల్లింగ్ యంత్రం, పశుగ్రాసం పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిఎం ఆనందకుమార్, రవి, మేనేజర్లు శరవణ కృష్ణ, అనిల్‌కుమార్, మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, మునసా ్వమి, పత్ర నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఎంపిపి సులోచన, వైస్ ఎంపిపి వెంకట్రామ గౌడు, నేతలు నరసింహులు, ఆంజనేయరెడ్డి, రామూర్తి, చిన్నికృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో గురువారం పూజలు

చౌడేపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలలో గురువారం విశేష పూజలు జరిగాయి. ప్రధానార్చకుడు పృద్వీనవీన్ ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో కాగడా హారతులతో ఆలయం దద్దరిల్లింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## కుప్పంలో మోస్తరు వర్షం.. ప్రజలకు ఊరట

కుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గురువారం కుప్పం పట్టణంలో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 10.30గంటలకే ఆకాశం నల్లటి మబ్బులు కమ్ముకుంది. ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం దాదాపు అర్ధగంటపాటు కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

# రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: కలెక్టర్

కుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నియోజకవర్గంలోని తహశీల్దార్లు,డిటిలు, ఆర్ఐలు, విఆర్వోలతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది వారి పరిధిలో ఉన్న గ్రామాల వారీగా అందిన సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజలు రెవెన్యూ సమస్యలపై కార్యాలయాలకు వస్తుంటారని అలా వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే విషయంలో చొరవ చూపాలన్నారు. వెబ్‌ల్యాండ్ ప్యూరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం మ్యుటేషన్లు, ఎఫ్‌లైన్ పిటీషన్, ఆర్ఓఆర్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఆర్డీఒ శ్రీనివాసులురాజు, డిఎస్ఒ శంకరన్, తహశీల్దార్లు చిట్టిబాబు, సీతారాం, శివయ్య, కౌలేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కుప్పం నియోజకవర్గంలో ఎంపిక చేసిన ఆలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు పదిహేను రోజుల్లో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.గురువారం స్థానిక హార్టీకల్చర్ హబ్‌లో దేవదాయ శాఖ అధికారులో జిల్లా కలెక్టర్ కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి సమీక్ష నిర్వహించారు. పరమసముద్రం శ్రీ బేటరాయస్వామి ఆలయంకు 2.66కోట్లు, రాళ్లబూదుగూరు శ్రీ కోదండరామాలయంకు 7.85కోట్లు, నూలుకుంట శ్రీకదిరి నరసింహస్వామి ఆలయంకు 1.35కోట్లతో టెండర్లు పిలవడం జరిగిందన్నారు. మిగతా ఎనిమిది ఆలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దేవదాయ శాఖ ఎస్ఇ సతీష్‌ను ఆదేశించారు. సమావేశంలో దేవదాయ శాఖ డిఇ జనార ్ధనరావు, దేవదాయ శాఖ ఎ.సి. చిట్టెమ్మ, ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పాల్గొన్నారు.

## వేసవిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ : ఇఓఆర్డీ కృష్ణవేణి

చౌడేపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



వేసవిలో గ్రామీణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నట్లు ఇఓఆర్డీ కృష్ణవేణి అన్నారు. మండలంలోని పలు చోట్ల పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా వేసవిలో ప్రజలు అంటు వ్యాధులకు గురవుతుంటారనీ, ఈ మేరకు పారిశుద్ధ్యం, మంచినీటి సక్రమ సరఫరాపై చర్యలు తీసుకొంటున్నామన్నారు. క్రమం తప్పకుండా మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, కాలువల శుభ్రత వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా దోమల నిర్మూలనకు అవసరమైన చోట్లలో ఫాగింగ్ చేస్తున్నామని ఆమె వివరించారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా మహాభారత యజ్ఞం

కల్లూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం కల్లూరులో జరుగుతున్న మహాభారత యజ్ఞంను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. మహాభారత యజ్ఞంలో భాగంగా బుధవారం ద్రౌపది కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ద్రౌపది కళ్యాణాన్ని నిర్వహించి కళ్యాణ ఘట్టాన్ని భక్తులకు వివరించారు. ఉభయ దారులుగా మాజీ సర్పంచ్ వెంకటరమణ, మునీశ్వర కుటుంబ సభ్యులు వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు కళ్యాణాన్ని కనులారా వీక్షించి తన్మయత్నం చెందారు.

## ప్రపంచ ఆటిజం దినోత్సవం

పాకాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త



పాకాల మండలం నందు భవిత కేంద్రంలో మండల విద్యా శాఖాధికారి బాబ్జి అధ్యక్షతన ప్రపంచ ఆటిజం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటిజం సమస్య ఉన్న పిల్లలను చిన్న వయస్సులోనే గుర్తించి వారి నైపుణ్యాలకు తగిన శిక్షణ ఇస్తే వీరు కూడా మాములు పిల్లలు లాగా తయారు అవుతారని అన్నారు. వీరి పట్ల సానుభూతి చూప కూడదని వీరిలో ఉన్న ప్రత్యేక మైన నైపుణ్యాలను గుర్తించి తర్ఫీదు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను ఇస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు ముని కృష్ణ రెడ్డి, సుందరి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎండల పట్ల అప్రమితంగా ఉండాలి

పూతలపట్టు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త

రోజు రోజుకి పెరుగుతున్న ఎండలు పట్ల ప్రజలు అపరిమితంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ గుంటూరు మురళి కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రత పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ ఉపాధి కూలీలు పనులు చేసే సమయంలో రైతులు జాగ్రత్త పాటించాలి ముఖ్యంగా వృద్ధులు పిల్లలు రైతులు అవసరమైతేనే బయట తిరగాలన్నారు. వడదెబ్బ కు గురైన వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు వేసవిలో జాగ్రత్తలు పాటించి ఆరోగ్య వంతంగా ఉండాలన్నారు.

## మానిటరింగ్ కమిటీ సమావేశంపై జిల్లా కలెక్టరుకు వినతి

కుప్పంరూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గసా ్థయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌లను ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ కోరారు. గురువారం కుప్పంలో ఆయన జిల్లా కలెక్టరును కలిశారు. కుప్పం మండలం వేపూరు గ్రామంలో ఇరవై ఎస్టీ కుటు ంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరగా కలెక్టర్ సాను కూలంగా స్పందించారు. అలాగే రామకుప్పం మండలం గద్దూరుకు చెందిన స్రవంతి అనే బాలిక తలసేమియా వ్యాధితో బాధపడుతోందని బాలికను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు గోవిందు, సతీష్, కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## తిరుపతి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు

సదుం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త



సదుం పంచాయతీ బట్టువారిపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో గురువారం నుంచి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గురువారం ఆలయంలో పుణ్యాహవాచనం, వాస్తు పూజ, గణపతి పూజ, నవగ్రహ, వాస్తు హోమాలు నిర్వహించారు. ఇందుకోసం గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పూజా సామాగ్రి తీసుకుని ఊరేగింపుగా బట్టువారిపల్లి ఆలయం వద్దకు వెళ్లి మారు పొంగలి పెట్టి పూజలు నిర్వహించారు.

## పోటా పోటీగా సంత వేలం

### - పంచాయతీకి రూ.7.50 లక్షలు ఆదాయం

యాదమరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:



యాదమరి సంత వేలం పోటా పోటీగా జరుగడంతో గ్రామ పంచాయతీకి 7.50 లక్షల రూపాయల ఆదాయం లభించింది. యాదమరి పంచాయతీ పరిధిలోని జోడిచింతల వద్ద వున్న వారపు సంత వేలంను గురువారం డిఎల్‌పిఓ పార్వతి, ఎంపిడిఓ వేణు, ఇఓఆర్డీ సుకుమార్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. యాదమరి వారపు సంత ఒక ఏడాది వేలం హక్కులను కైవసం చేసుకోవడానికి ఒకొక్కరు 95 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించి పోటీ పడ్డారు. ప్రభుత్వం యాదమరి వారపు సంత వేలం హక్కుల కనీస మొత్తం రూ.3.70 లక్షలుగా నిర్ణయించి అధికారులు పాట ప్రారంభించారు. అధికార తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాలు సంత వేలంను కైవసం చేసుకోవడానికి పోటీ పడటంతో 7.50 లక్షల వరకు పాట వెళ్ళింది. వేలం పాటు రూ.6.35 లక్షల వద్ద వుండగా సంత వేలం లీజు హక్కులు కైవసం చేసుకోవడానికి అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ఒక్కసారిగా 7.50 లక్షల రూపాయలు చెప్పడం, ఆపై తాను 6.50 లక్షలకు చెప్పానని పేర్కొనడంతో అధికారుల ఎదుటే ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరికి అధికారులు వేలం పాటలో పొరబాటున చెప్పినప్పటికీ అది చెల్లదని స్పష్టం చేసి ఆ వ్యక్తి పేరిట 7.50 లక్షల రూపాయలకు సంత వేలం లీజు హక్కులు ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. ఒకవేళ లీజు హక్కుదారుడు నిర్ణయించిన మొత్తంను చెల్లించకపోతే వేలం పాటలో రెండవ స్థానంలో వున్న వ్యక్తికి సంత వేలం లీజు హక్కులు ఇవ్వడం జరుగుతుందని డిఎల్‌పిఓ పార్వతి పేర్కొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ దరఖాస్తుల స్వీకరణ

రొంపిచెర్ల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:

రొంపిచెర్ల మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులను నేటి నుండి ఏప్రిల్ 22 వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ తెలిపారు. కళాశాలలో చేరే విద్యార్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు పదవ తరగతి ఫలితాల్లో ప్రతి ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. మోడల్ స్కూల్, కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. పదవ తరగతి మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఆదర్శ పాఠశాలలో చేరే విద్యార్థినీ, విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని అన్నారు. అలాగే 7, 8, 9 తరగతుల విద్యార్థులు ప్రవేశాలకు పాఠశాల కార్యాలయానికి సంప్రదించాలని కోరారు. వివరాల కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు లకు సంప్రదించాలని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 9849387564 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

## బాలికపై వ్యక్తి అత్యాచార యత్నం.. పోక్సోయాక్ట్ కేసు నమోదు

కుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

మండలంలోని కంగుంది పంచాయతీ గిడ్డెగానిపెంట గ్రామంలో ఓ మైనర్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు కుప్పం అర్బన్ ఎస్సై బాబు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామ ంకు చెందిన రమేష్ (30) అనే వ్యక్తి బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడన్నారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రమేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా రమేష్‌కు భార్య,పిల్లలు సైతం ఉన్నట్లు సమాచారం.

## ఘనంగా ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవం



సదం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త

మండల పరిధిలోని తాటిగుంట పాలెం పంచాయతీ పాపి రెడ్డి గారి పల్లెలో ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ శాంతి హోమాలు నిర్వహించారు. కుంభారాధన జరిపించారు. అదేవిధంగా గురువారం ఉదయం గణపతి పూజ, అనంతరం అష్టోత్తర శత కలశాభిషేకం, మూలమంత్రం హోమం జరిపించారు. సాయంత్రం గ్రామ ఉత్సవం నిర్వహించి అమ్మవారిని పుష్ప పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా వీర కాసే నృత్యం వీరభద్ర స్వామి వేషం పోతురాజు వేషాలు, అఘోర వేషాలతో అమ్మవారిని బాణ సంచ వేడుకల మధ్య గ్రామంలో ఊరేగింపు జరిపించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొకులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త డిఆర్ దామోదర్ కుటుంబ సభ్యులు, నీటి సంఘం సభ్యుడు వై రెడ్డి శేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లు లోక్‌సభ ఆమోదించడంపై హర్షం

.శ్రీకాళహస్తి, ఏప్రిల్3 ప్రభాతవార్త



వక్ఫ్ సవరణ బిల్లు లోక్‌సభ ఆమోదించడంపై బిజెపి రాష్ట్ర నాయకుడు కోలా.ఆనంద్ కుమార్ తెలిపారు. అగ్రగామిగా దేశం అవతరించే దిశగా మోదీ సంకల్పమే వక్ఫ్ సవరణ బిల్లు దేశం 2047 నాటిని ప్రపంచ అగ్రగామికాడానికి పార్లమెంటులో సవరణ బిల్లులు ఆమోదించడం హర్షణీయం అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. శ్రీకాళహస్తిలోని బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వహించి బిల్లుకు మద్దతు ఇచ్చిన కూటిమి అధినేతలు నారాచంద్రబాబునాయుడు, కొణిదల పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అధికార విపక్షాల మధ్య రాజ్యసభలో 12గంటల పాటు జరిగిన వాడీ వేడీ చర్చ అనంతరం వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించిందిందన్నారు. రాజ్యాంగంలోని ప్రజాప్రతినిధులు బిల్లులకు అనుకూలంగా 288 ఓట్లు కాగా వ్యతిరేకంగా 232 ఓట్లు పడ్డాయన్నారు. బిల్లులో ప్రతిపక్షాలు చేసిన అన్ని సవరణలును, సభ తిరస్కరించి బిల్లును అధికార ఎన్డీయే సమర్ధించుకోగామైనార్టీలకు భారత్‌ను మించిన సురక్షితమైన దేశం మ రొకటిలేదని కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు మద్దతు తెలియజేయడంపై ఆయన ఎన్డీయే ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.దేశంలోని ప్రజలందరికీ ఒకేన్యాయం, రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్, జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర సభ్యులు ఎస్వీరమణ, జిల్లాఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, కుప్పాప్రసాద్ రాయల్, మండల అధ్యక్షులు వేదాంకృష్ణయ్య, వెంకటేష్, వాసుయాదవ్, పుణ్యండిల్లీకుమార్, భరత్‌కుమార్ నాయుడు, హరీష్ పుచ్చుకాయల రమేష్‌యాదవ్, గిరిధర్‌సాయి, చైతన్య, నాని తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త



నగరంలోని ఖాళీ స్థలాలలో చెత్త వేసినా, శుభ్రంగా ఉంచుకోకపోయినా జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 14, 17 వార్డుల్లో పారిశుద్ధ్య పనులను హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు చెత్త తో నిండి ఉన్నాయన్నారు. దీని వలన ప్రక్కన ఇండ్ల వాళ్ళు ఇబ్బంది పడడమే కాకుండా అపరిశుభ్రంగా తయారు అవుతోందని అన్నారు. అందువల్ల ఆ స్థలం వారిని గుర్తించి జరిమానాలు విధించి శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువలు లేని ప్రాంతాల్లో కాలువల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరు ఇస్తే కలిగే లాభాలను పద్మావతి పార్కులో ప్రజలకు వివరించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో తిరుపతిని మొదటి స్థానంలో ఉంచేలా అందరూ సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి వీధిలోకి చెత్త వాహనం ఒక నిర్దిష్ట సమయంలో వెళ్లేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ. మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎంఎల్‌సికి శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన ఎంఎల్‌సిగా ఎన్నికైన కొణిదెల నాగ బాబును విజయవాడలో ఓ ప్రైవేటు హోటల్‌లో మర్యాద పూర్వకంగా కలసి శ్రీకాళహస్తి జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్, చంద్ర, అరిగెల వేణుగోపాల్ నాయుడు, పగడాల ప్రతాప్‌లు శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు.

## మండలాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్దాం : ఎంపీడీవో



కేవీబీపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: కెవీబీ పురం మండలాన్ని అభివృద్ధి పథంలో నవంబర్‌వన్‌గా తీసుకెళ్లాలని ఎంపీడీవో రాధారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు రాయదుర్గం మునిలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాల దృష్ట్యా వివిధ రకాల అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, అలాంటిపథకాలను పంచాయ తీల్లో ప్రజలకు లబ్ధిదారులకు చేరవేయడంలో అధికారులు ముందుండి విజయ వంతంగా గ్రౌండింగ్ చేయగలిగితే ప్రజలకు, అధికారులకు ప్రభుత్వానికి మంచి పేరు ఉంటుందన్నారు. అందరూ కట్టుబడి ఐక్యతగా నిష్పక్షపాతంగా పని చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తహసీల్దార్ మునిరత్నం మాట్లాడుతూ మండలంలో రీ సర్వే జరుగుతుందని, అందరూ గ్రామాల్లోకి వెళ్లి పంచాయతీ కేంద్రంలోనే కాకుండా గ్రామాల్లో, కాలనీల్లో సైతం లబ్ధిదారులను గుర్తించాలని తెలిపారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త డిజిటల్ రేషన్ కార్డులు మంజూరు చేయబోతుందని అందుకు ప్రతి ఒక్క కుటుంబంలో సభ్యులు ఎంత మంది ఉన్నారు, పిల్లలతో సహా ఈకేవైఎస్ చేయించుకోవాలన్నారు. సర్పంచ్‌లు గ్రామాల్లో వేయించాల్సి పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు సైతం దీనిపైన శ్రద్ధ పెట్టాలని ఆయన తెలిపారు. రీ సర్వేలో భూమి రికార్డులు కచ్చితంగా వనిత సర్వే అధికారులకు చూపించి భూమి రికార్డులు చేయించుకోవాలని సూచనలు ఇచ్చారు. తాగునీటి సమస్యగ్రామాల్లో ఎక్కడైనా ఉంటే వెంటనే మండల కార్యాలయానికి చరవాణి ద్వారా తెలియజేయాలని, త్వరలో పరిష్కార మార్గం చేపడతామని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు, వి.సరస్వతి, జడ్పీటీసీ మూర్తి మునెమ్మ, సుబ్బయ్య, ఉపాధిహామీ ఏపీడీ సరిత, ఏపీవో భాస్కరయ్య, మండల ఈవోపీఆర్‌డీ వల్లి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే



పుత్తూరు రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌లు కలసి పుత్తూరు, వడమాలపేట అధికారులతో సమీక్ష సమావేశం పుత్తూరు పురపాలక సంఘంలో నిర్వహిం చారు. పుత్తూరు మున్సిపాలిటీ వడమాలపేట మండలాల్లో తాగునీటి ఎద్దడి కలెక్టర్ వెంకటేశ్వరులు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం(గూళూరు) చెరువు నీరును పుత్తూరు సమ్మర్‌స్టోరేజీ ద్వారా మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటి సమస్యను తీరుస్తామని వారు తెలిపారు. పుత్తూరు, వడమాలపేట మండలాల్లో, గ్రామాల్లో మట్టి రోడ్లు గుర్తించి వెంటనే సీసీ రోడ్లు వేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు, తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి ప్రజా సమస్యలపై వినతి



పుత్తూరు రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: నగరి నియోజక వర్గం పుత్తూరు, వడమాలపేట మండలాల సమీక్ష సమావేశం పుత్తూరు మున్సిపల్ కార్యాలయ ంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, కలెక్టర్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పార్టీ పుత్తూరు మండల సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి, కలెక్టర్‌కి పుత్తూరులో ప్రజా సమస్యలపైన వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ పుత్తూరు మండలంలో టీట్కో ఇల్లు అసంపూర్తిగా ఉందని, లబ్ధిదారులు వడ్డీలు ద్వారా 50 వేలు 25 వేలు ముందస్తుగా కట్టారని, కానీ లబ్ధిదారులకు ఇంత వకు టిట్కో ఇల్లు అందించలేదని అన్నారు. ఎమ్మెల్యే స్పందించి మీ న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహేష్, మురుగేష్ రెడ్డి, చిరంజీవి, హేమాద్రి, కట్ట కింద రామకృష్ణాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## 6 తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలు

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని కాపు వీధిలో వెలసిన(నోముల గుడి), శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఈ నెల 6 తేదీ నుంచి 15 తేదీ వరకు శ్రీ కోదండరామస్వామి నవరాత్రి మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ, కార్యవర్గ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరవుతున్నట్లు వివరించారు. ప్రతిరోజు ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణలు ఉంటాయని తెలిపారు.

## ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలి



సత్యవేడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా, రాష్ట్రఆర్టీసీ శాఖలోని అన్ని కేటగిరిలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ సత్యవేడు డిపో సెక్రటరీ వి.బాబు కోరారు. తమ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ఎరుపు బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం ఉదయం స్థానిక డిపో ప్రవేశ ద్వారం వద్ద పలువురు ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ సభ్యులు ఎరుపు బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికుడే వహించేటట్టు చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.చెంచలయ్య, డిపో అధ్యక్ష పి.పి.సారథి, గ్యారేజీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.శేఖర్, కుప్పయ్య, సీసీఎస్ డెలిగేట్ జి.సురేష్, కేసీఆర్ నాయకులు, డిపో నాయకులు, గ్యారేజీ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా శ్రీదేవి బాధ్యతలు స్వీకరణ



బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్3 ప్రభాతవార్త: బుచ్చినాయుడు కండ్రిగ మండల తహసీల్దార్‌గా శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్‌కు పదవీ విరమణ చేయడంతో వారి స్థానంలో శ్రీకాళహస్తిలోని ఆర్డీవో ఆఫీసులో ఏవోగా పని చేస్తున్న శ్రీదేవి ప్రభుత్వం బుచ్చినాయుడు కండ్రిగ తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఆమె మాట్లాడుతూ అందు బాటులో ఉంటూ ప్రజా సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరిస్తానని తెలియజేశారు.

## ల్యాబ్ మెటీరియల్ వితరణ



విజయపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: మండలంలోని జంబాడ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతులు మీదుగా మండలంలోని ఉన్నత పాఠశాలలకు ల్యాబ్ పరికరాలు పంపిణీ చేశారు. చిన్నప్పరాజు ట్రస్టు, ఐఎఫ్‌టీఆర్ మద్రాసు వారి ఆధ్వర్యంలో రూ.2 లక్షలు విలువ చేసే ల్యాబ్ పరికరాలను జంబాడ, శ్రీహరిపురం, విజయపురం, పన్నూరు, గంగమాంబాపురం ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ కృష్ణంరాజు, ఐఎఫ్‌టీఆర్ టీం డా.దేవనాథన్, శేషాద్రి, ఇరులాండీ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు లక్ష్మీపతిరాజు, వివిధ పాఠశాలప్రధానోపాధ్యాయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సమయపాలన పట్టించుకోవడం లేదు



బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్3 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకంను రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉపాధిహామీ పథకం అమలు చేస్తుంది. ఈ పథకంను అమలు చేయవలసిన అధికారులు సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు నాన్న ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక తనిఖీల ఆడిట్ పేరుతో కార్యక్రమం నిర్వహించి తూర్పు మంత్రంగా చేతులు దులుపుకుంటున్నారు. ఉపాధిహామీ పథకం ఉద్దేశాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పని చేయాలని కాని జీతాల కోసం కాదని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఆరు కిలోమీటర్ల దూరంలో పాఠశాలను విలీనం చేస్తారా?




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తికి సుమారు 16కిలో మీటర్ల దూరంలోని బ్రాహ్మణపల్లి దళితవాడలోని పాఠశాలలో సకల సదుపాయా లుండగా సంఖ్యా బలం పేరుతో పాఠశాలను సుమారు 6కిలో మీటర్ల దూరంలోని కార్లపూడి పాఠశాలలో విలీనం చేయటానికి ప్రయత్నించటం దారుణమని గ్రామస్తులు వాపోతున్నారు. దళితుల చదువుల పట్ల ఇంత చిన్నచూపా అని పాఠశాల చైర్మెన్ మణి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 24 మంది విద్యార్థులు న్నారు. ఈ పాఠశాలలో సకల సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఈ పాఠశాలను గ్రామానికి సుమారు 6కిలో మీటర్ల దూరంలోని కర్లపూడి పంచాయతీ పాఠశాలలో విలీనం చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఒక వేళ ఇక్కడ సంఖ్యాబలం తక్కువ ఉంటే ప్రభుత్వ నిబంధనలు అనుమతించకుంటే అదే పంచాయతీలోని గురకలకండ్రిగలో ఉన్న పాఠశాలలో విలీనం చేయవచ్చు. ఈ పాఠశాల బ్రాహ్మణపల్లికి కేవలం ఆరకిలో మీటర్ దూరంలో ఉంది. అలా కాకుండా సుమారు 6కిలో మీటర్లు అడవి దారిలో వెళ్ళాల్సిన చోటకు మార్చటం గమనించదగ్గ విషయం. బ్రాహ్మణపల్లి పాఠశాలను కర్లపూడిలోని పాఠశాలకు మార్చితే విద్యార్థులు తమ సొంత ఖర్చులతో ఆ పాఠశాలకు వెళ్ళాలి. ఒక్కొక్క విద్యార్థి ఆటోలో వెళ్లాలంటే నెలకు కనీసం రూ.1000 నుంచి 1500లు చెల్లించాలి అంటే ఏడాదికి కనీసం రూ.12 నుంచి 18వేలు వెచ్చించాలి. బ్రాహ్మణపల్లి దళిత వాడలోని పాఠశాలను సుమారు 6కిలో మీటర్ల దూరంలోని కర్లపూడిలో విలీనం చేయటాన్ని పాఠశాల విద్యాకమిటి చైర్మెన్ మణి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదాలపై ప్రభాతవార్త ఎంఇఒ లక్ష్మీపతిని వివరణ కోరగా ప్రభుత్వం 117 జిఒను రద్దు చేసారని కొత్త నిబంధనల మేరకు 60మంది విద్యార్థులుండాలని లేదంటే సమీపంలోని పాఠశాలలో వీలినం చేయమని ప్రభుత్వ ఆదేశాలు సూచిస్తున్నాయన్నారు. ఇక్కడ బేసిక్ పాఠశాల ఏర్పాటుకు నివేదిక పంపామని వివరించారు.

## నేడు మంత్రి పార్థసారథి తిరుపతికి రాక

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుక్రవారం తిరుపతికి రానున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకున్న అనంతరం సాయంత్రం 6 గంటలకు గూడూరులోని ఆది శంకర్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాల నందు జరిగే సిల్వర్ జూబ్లీ వేడుకలలో, మహర్షి మహేష్ యోగి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గాన బయలు దేరి రాత్రి 8.15 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌నకు వెళ్ళ నున్నారని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

## ఘనంగా తల్లిపాల నిధి ప్రథమ వార్షికోత్సవం



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : తల్లి సృష్టికి ప్రతి సృష్టి అంటూ తిరుపతి మెటర్నటీ ఆస్పత్రిలో తల్లిపాల నిధి ద్వారా అమృతానికి మరింత ప్రాధాన్యత ఉందని తిరుపతి స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి కుమార్ అన్నారు. గురువారం ఉదయం మెటర్నటీ ఆస్పత్రులు రోటరీ తల్లిపాల నిధి ప్రథమ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆయన పుట్టిన బిడ్డల ఆకలి తీర్చడమే కాక రోగ నిరోధక శక్తిని పెంచే తల్లిపాలను అందించడానికి ముందుకు వచ్చిన తల్లులకు వందనం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 247 లీటర్ల తల్లిపాలను సేకరించి 3475 మంది తల్లి పాలు అవసరమైన పిల్లలకు పంపిణీ చేయడం రోటరీ క్లబ్ చేస్తున్న అత్యుత్తమ సేవ అని కొనియాడారు. తల్లిపాల నిధి ఛైర్మన్ టెంకాయల దామోదరం, కో ఛైర్మన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సోము రవికుమార్ మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు ఇవ్వగా మిగిలిన పాలను తల్లిపాల నిధికి దానం చయేసి తల్లిపాలకు నోచుకోని పిల్లలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరిటీ, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ఆర్.ఆర్ రెడ్డి, డాక్టర్ రవి ప్రభు, డాక్టర్ బాలకృష్ణనాయక్, డాక్టర్ ఉషా కళావతి, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సీనియర్‌నేత ధనంజయులునాయుడు మృతి



తిరుపతి(రవాణ), ఏప్రిల్ 3ప్రభాతవార్త: బిజెపి సీనియర్‌నేత, పలు హోదాల్లో సేవలందించిన గాలి ధనంజయులు నాయుడు అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్. బిజెపి నేతలు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, శాంతారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు.

## భక్తులకు మజ్జిగ పంపిణీ



తిరుపతి(రవాణ), ఏప్రిల్ 3ప్రభాతవార్త: రాముడి అనుగ్రహంతో అంతా మంచిజరగాలని, భక్తులు సంతోషంగా ఉండాలని రాయలసీమ రంగస్థలి, చిగోరా సంస్థ ఆకాంక్షించింది,, కోదండ రాముని రథోత్స వంలో గురువారం ఉదయం రంగస్థలి గుండాల గోపీనాథరెడ్డి, చిగోరా చిత్రపు హనుమంతరావు కలసి రాములవారి దక్షిణమాఢవీధిలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు

## పెన్షన్ మార్పు బిల్లుపై నిరసన ర్యాలీ




రేణిగుంట ఏప్రిల్ 3 ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం పెన్షన్ బిల్లు విధివిధానాలు మార్పు చేస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసినందుకు నిరసనగా ఏఐఆర్‌ఎఫ్ అధ్యక్షులు డాక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు గురువారం సిఆర్ఎస్ విశ్రాంత ఉద్యోగ అసోసియేషన్ నేతలు నిరసన తెలియజేస్తూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. సిఆర్ఎస్ పెన్షనర్స్ కార్యాలయం నుండి సిడబ్ల్యూఎం కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం సిడబ్ల్యూఎం దేవ సహాయంకు విశ్రాంత ఉద్యోగ నేతలు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్ఎం విజయ్ కుమార్, అధ్యక్షులు సురేంద్రరెడ్డి, సహాయ కార్యదర్శి గజపతి నాయుడు, ఆనందు తదితరులతోపాటు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయాలి



తిరుపతి విద్య, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : స్థానిక అవిలాల, ఆర్‌సి రోడ్డులో భాష్యం బ్లూమ్స్ సీబీఎస్‌ఈ స్కూల్ ప్రారంభోత్సవం జోనల్ ఇంచార్జి లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంత రావు, ఎండీ భాష్యం సాకేత్ రామ్‌లు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మట్లాడుతూ విద్యార్థులలో బాల్యం నుంచే సృజనాత్మకతను వెలికి తీయడానికి భాష్యం విద్యాసంస్థలు ఎప్పుడూ ముందుటాయని ఇందులో భాగంగానే నగర విద్యార్థుల కోసం సీబీఎస్‌ఈ స్కూల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీషా, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కళల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి



తిరుపతి విద్య, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ చే విద్యార్థులకు శాస్త్రీయ సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు సంస్కృత పేరుతో శాస్త్రీయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియం లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ స్కూల్ డైరెక్టర్స్ డాక్టర్ కృష్ణ కిశోర్, వసంత కిషోర్ మాట్లాడుతూ భారతీయ కళల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సంస్కృత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్‌లు పురుషోత్తం, రవి, వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వీబీఆర్ క్యాంపస్ డ్రైవ్‌లో విశేష స్పందన




తిరుపతి విద్య, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యశోధ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో తిరుపతిలోని డాక్టర్ వీబీఆర్ విద్యాంస్థలలో గురువారం జరిగిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎమ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో మేళాలో పాల్గొని ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యా సంస్థ ఛైర్మన్ డాక్టర్ వేల్పుల విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యా సంస్థలో విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ మేళాలో వైస్ ఛైర్మన్ త్రిపుర దేవి, ప్రిన్సిపల్ ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపల్ అతుల్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు తిరుపతి ఐఐటి 10వ వార్షికోత్సవం




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడులో వెలసిన తిరుపతి ఐఐటి పదవ వార్షికోత్సవంను అంగరంగ వైభవంగా నిర్వహించుటకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పదేళ్ళు విజయవంతంగా నిర్వహించిన కళాశాలలో సంబరాలు జరుపుకోనున్నట్లు డైరెక్టర్ సత్యనారాయణ గురువారం వివరించారు. పదేళ్ళలో ఐఐటికి దేశంలోనే మన్నిక చెందిన ఐఐటిలో జాబితాలో చేర్చగలిగామని సంతృప్తి వ్యక్తం చేసారు. ఎన్నో సామాజిక విద్యా, సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 2014లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించి 2015 విద్యాసంవత్సరం నుంచే ప్రారంభించిన ఐఐటి సుమారు నాలుగేళ్ళ పాటు ఓ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో తరగతులు నిర్వహించామన్నారు. నాడు 120మందితో ప్రారంభమైన ఐఐటి నేడు 1700 మంది విద్యార్థులతో కళ కళ లాడుతుందని సత్యనారాయణ వివరించారు. శుక్రవారం పదవ వార్షికోత్సవం జరుపుకొనుటకు విద్యార్థులు, అధ్యాపకులు సన్నాహాలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమాలకు ఫౌండర్ ఆర్‌వి కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌వి చక్రపాణి హాజరు కానున్నట్లు వివరించారు.

## రైటింగ్ స్కిల్స్‌తో... సమాచారం విశ్వవ్యాప్తం



తిరుపతి విద్య, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : అకడమిక్ రైటింగ్ స్కిల్స్ పెపొందించే కుంటేనే ఆలోచనలు, రచనలు వంటి సమాచారం ప్రపంచానికి చేరుతుందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. ఎస్వీయూ ఇంగ్లీషు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు, పండితులకు అకడమిక్ రైటింగ్ పై మెలుకువలు అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ వర్క్ షాపు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు, పరిశోధకులు, పండితులు రైటింగ్ స్కిల్స్ పై ప్రత్యేక దృష్టి సారించి మెలుకువలను అభ్యసనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ మురళీ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మిల్కీ మిస్ట్‌తో మిల్క్‌లైన్ భాగస్వామ్యం

తిరుపతి విద్య, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ఇన్నోటెర్రా యొక్క పాడి, పశువుల మేత వ్యాపార సంస్థ అయిన మిల్క్‌లేన్, మిల్కీ మిస్ట్ యొక్క విస్తరిస్తున్న ఉత్పత్తి శ్రేణికి అధికనాణ్యత, 100శాతం మూలం గుర్తించదగిన (ట్రేసబుల్) పాలను సుస్థిరదాయకంగా సరఫరా చేయడానికి భారతదేశంలోని అత్యంత వినూత్నమైన పాల బ్రాండ్‌లలో ఒకటైన మిల్కీ మిస్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. మిల్క్‌లేన్ తన పటిష్ఠ రైతుల నెట్‌వర్క్, కఠినమైన నాణ్యత నియంత్రణను ఉపయోగించి ప్రీమియం పాలను సరఫరా చేస్తుందని మిల్క్‌లేన్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ శర్మ తెలిపారు.

## మహిళ కనబడుటలేదు!



శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం కందాడు గ్రామానికి చెందిన సెల్వి(47) కనబడుట లేదని గురువారం కుమారుడు మునిశేఖర్ ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసారు. అనందం సుబ్రమణ్యం సతీమణి మానసిక వ్యాధితో బాధపడుతుండగా డాక్టర్ల వద్ద చూపిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె కుమారుడు మునిశేఖర్ సోమవారం తిరుపతిలో ఓ కంటి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తీసుకెళ్ళి వైద్యపరీక్షలు జరిపించి ఇంటి వద్ద కందాడు గ్రామంలో వదలిపెట్టాడు. బయటకు వెళ్ళి రాగా తిరిగి రాగా ఇంటిలో సెల్వి లేకపోవటంతో చుట్టుపక్కల వెతికారు. కానీ కనబడలేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేసారు.

## శ్రీకాళహస్తిలోని లాడ్జిలపై పోలీసుల దాడులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని లాడ్జిలపై పోలీసులు దృష్టి సారించారు. పుణ్యక్షేత్రంలో విచ్చల విడిగా వ్యభిచారం జరుగుతున్నట్లు ఎంతో కాలంగా అభియోగాలున్నాయి. గురువారం మధ్యాహ్నం వన్‌టౌన్ పోలీసులు ఆకస్మికంగా దాడులు జరిపారు. సిఐ డి.గోపి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మాడావీధుల్లో ఉన్న లాడ్జిలపై దాడి జరపగా తేరువీధిలోని ఓ లాడ్జిలో వ్యభిచారం రుజువైనట్లు సిఐ గోపి తెలిపారు. నలుగురు మహిళలు ఇద్దరు విటులను అదుపులో తీసుకున్నట్లు వివరించారు. ఈ పనులకు సూత్రధారులెవరో తెలుసుకోవటానికి విచారణ జరుపుతున్నట్లు సిఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి చెందిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులను గురువారం మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు సత్కరించారు. ఉద్యోగులుగా పని చేసి 15 సంవత్సరాల ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సత్కరించారు. ఆయన మాతృమూర్తి ఉపాధ్యాయు రాలు సరోజనమ్మ జ్ఞాపకార్థం 20 సంవత్సరాలుగా దేవుని చిత్రపటాలను బహుకరించి ఘనంగా సత్కరిస్తున్నట్లు వివరించారు. వీటిని శ్రీనివాసులు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బూడిదవాకం వెంకయ్య, ప్రధానా కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి వెంకటరమణయ్యలకు అందజేసారు. ఈ కార్యక్రమాల్లో వైకాపాకు చెందిన శ్రీవారి సురేష్, ముని, వేలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల, తిరుపతి వాసుల సమస్యలు...సిఎంకు విన్నపం



తిరుపతి, ఏప్రిల్ 3ప్రభాతవార్త: తిరుపతి, తిరుమలలో స్థానికులకు అన్ని విధాలా ఆదుకోవాలని, వారి సమస్యలు సహృదయంతో పరిష్కరించాలని తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మసిఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం ఆమె ఉండవల్లిలో సిఎంను మర్యాదపూర్వకంగా కలిశారు.

## తిరుపతి జిల్లాకు మంత్రి నాదేండ్ల రాక

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 2.10 గంటలకు ఏపీ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని 3.30గంటలకు వడమాలపేట మండలం తిరుమణ్యం పంచాయతీ పరిధిలోని ఎనమలపాళెంలో రైతు సేవా కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి అనంతరం సాయంత్రం 5గంటలకు కెనడీ నగర్ లక్ష్మినగర్ సర్కిల్, తిరుపతి నందు దీపం-2 ఎల్పీజీ లబ్దిదారులకు సిలిండర్ పంపిణీ చేస్తారని, అనంతరం మంత్రి తిరుమల చేరుకుని రాత్రి బస చేసి, 6వ తేది ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు తిరుగుపయనం కానున్నారని తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభం బన్సల్ గురువారం మీడియాకు తెలిపారు.

## ఎంజిఎం హోటల్‌ను సందర్శించిన సినీనటి పూజాహెగ్డే



తొట్టంబేడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనార్థం విచ్చేసిన ప్రముఖ సినీనటి పూజా హెగ్డే గురువారం ఆలయంలో పూజలు నిర్వహిం చుకున్న అనంతరం హోటల్ ఎంజిఎం గ్రాండ్‌కు విచ్చేశారు. ఇందులో భాగంగా ఎంజిఎం హోటల్ గ్రాండ్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మరియు ఐశ్వర్యలు పూజాహెగ్డేకు స్వాగతంపలికారు. అనంతరం డైరెక్టర్ ఐశ్వర్య సినీనటిని దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని ప్రత్యేక ప్రసాదాలు అందించారు. అనంతరం హోటల్‌లో బసచేశారు. కార్యక్రమంలో ఎంజిఎం సంస్థ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్‌ను సత్కరించిన వినుత కోట



శ్రీకహస్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : గురువారం మంగళగిరి ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన తిరుపతి నుంచి పళని బస్సు సౌకర్యం ప్రారంభించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్‌ను శ్రీకాళహస్తి జనసేన ఇన్‌ఛార్జి వినుత కోట దంపతులు మర్యాదపూర్వకంగా కలసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కోట చంద్రబాబు పలువురు జనేన నాయకులు పాల్గొన్నారు.

## ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశం

తొట్టంబేడు, ఏఫ్రిల్ 3 ప్రభాతవార్త : ఈనెల 9వ తేదిన మండలపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఓ పి.సురేంద్రనాద్ తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే సమావేశానికి అన్నిశాఖల అధికారులు తమ తమ నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి ఎంపిపి ఉన్నం నిర్మలతో పాటు మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ వర్ధంతి



తొట్టంబేడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : భారతీయ జనతాపారట్ట రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ నేతృత్వంలో శ్రీకాళహస్తి పట్టణ బిజెపి కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 345వ జయంతి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కోలా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ భరతజాతి ముద్దుబిడ్డ, వీరత్వం, పరాక్రమానికి ప్రతీక అని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, రాష్ట్ర సభ్యులు ఎస్వీరమణ, కుప్పప్రసాద్, గోపాల్, కృష్ణయ్య, వెంకటేష్ పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోంది : మాజీ ఎమ్మెల్యే



నాయుడుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ పాలన నడిపిస్తోన్నారని సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. నాయుడుపేట వైసిపి క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లడుతూ ప్రభుత్వం ప్రజల అభివృద్ధిని సంక్షేమం గాలికి వదిలేచి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడుగడుగున అవమానిస్తూ వైసిపి నాయకులను టార్గేట్‌చేసి, పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు ఉదాహరణ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అధికారపార్టీ నాయకులు చేపడుతున్న ఇసుక,గ్రావెల్,మట్టి మాపియా, అరాచకాలను ఎండకట్టుతూ ప్రశ్నించినందుకే వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధర్‌రెడ్డిపై అక్రమ కేసులుపెట్టి అణచి వేయాలని ప్రయత్ని స్తున్నారని ఆయన తెలిపారు. ఈసమావేశంతో మాజీఎస్సీసిబి చేర్మేన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి,నాయుడుపేట మున్సి పాల్టి చేర్మేన్ కటకం దీపిక, ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డ, మాజీఏఎంసి తంబిరెడ్డి జనార్ధన్‌రెడ్డి,కౌన్సి లర్లు,తదితర నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## పోస్టల్ ఉద్యోగులచే నిరసన కార్యక్రమం



గూడూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా పోస్టల్/ఆర్.ఎం.ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ గూడూరు డివిజన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగులకు సంబంధించిన పెన్షన్ రూల్స్ అతి ప్రమాదకరమైన, తీవ్ర నష్టదాయకమైన సవరణను లోకసభలో ఆర్థిక బిల్లులో భాగంగా ప్రవేశపెట్టి ఆమోదించారని, ఇప్పుడు బిల్లు రాజ్యసభ ఆమోదం కొరకు పంపుతున్నారని, అక్కడ కూడా సదరు బిల్ పాస్ అయిన యెడల అది చట్టం అయితే కేవలం 68 లక్షల కేంద్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల పెన్షన్ దారులకు, 48 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుండడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ దారులకు కూడా ఉరితాడు అవుతుందని,వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కే.సుధాకర్, సి.సుధాకర్ రాజు, ఏ.మల్లికార్జున్, ఏ.తిరుణాకర్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



గూడూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: గూడూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం గూడూరు కోర్ట్ ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. గూడూరు బార్ నూతన అధ్యక్షునిగా సోమిశెట్టి ఉమాశంకర్, ఉపాధ్యక్షులు కె.హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఏం వెంకటకృష్ణయ్య, కోశాధికారిగా ఎస్.కె.వహీద, లైబ్రరీ సెక్రటరీగా యూసఫ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా ప్రతాప్ కుమార్, మహిళా ప్రతినిధిగా ఎస్ కె నాగూర్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా నవకోటి, ఈ సుమన్, జీ ఏడుకొండలు, పి.సుమన్, ఎస్‌కె.మహబూబ్ భాషలు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు సాయి కుమార్‌రెడ్డి, కొత్తపల్లి వసంత్ కుమార్, చంద్రమోహనరెడ్డి, విజయరామ రాజు, కెవి కృష్ణయ్య, శ్రీధర్, గోపాల్ రెడ్డి, కోటేశ్వరావు, ఎస్వి, వనం ప్రసాద్, తీగల చంద్రశేఖర్, పచ్చికల అనీల్, ఈదురు మధుకర్, యనమల గురుసాయి, పులవర్తి నరేంద్ర, సర్వేపల్లి దయాకర్, సన్నిబోయిన శ్రీనివాసులు యాదవ్ విజయ్ భాస్కర్‌రెడ్డి, సునీల్, మోహన్, పులికొండ శ్రీనివాసులు తదితరులు పూలమాలలు వేసి సత్కరించి అభినందించారు.

## మా వంతు సహకారం అందిస్తాం : ఎమ్మెల్యే పాశం



గూడూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి మా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రభుత్వం ఇటీవల ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టిందని తాము కోరిన వెంటనే డిఎం డిప్యూటీ కంపెనీ వారు 10కంప్యూటర్లు కాలేజీకి అందించడం అభినందనీయమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటర్ డిగ్రీ ఇదే కళాశాలలో చదువుతున్నానని నా రాజకీయ రంగ ప్రవేశం కూడా అక్కడే జరిగిందని కాలేజీ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, రహీం, లీలావతి, బుజిగెందర్ రావు, శ్రీనివాసులు రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## వెంకన్నపాలెం రైతులకు న్యాయం చేస్తాం

**- జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్**



కోట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : కోట మండలం వెంకన్నపాలెం గ్రామంలోని గర్భకండ్రిగ రైతులకు న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. వెంకన్నపాలెం గ్రామంలోని గర్భకండ్రిగలో 342 ఎకరాల 78 సెంట్లలో రైతుల పొలాలు ఉన్నాయి. ఆ భూములకు సంబంధించి రైతులు క్రయ విక్రయాలు జరుపుకోవాలంటే ముటేషన్లు సవరణలు గాని, రిజిస్ట్రేషన్లు గాని కావడం లేదని రైతులు గత రెండు దశాబ్దాలుగా అధికారుల చుట్టూ తిరుగు తున్నారు. ఈ క్రమంలో సర్పంచ్ మధుయాదవ్, రైతులు ఇటీవల జాయింట్ కలెక్టర్‌ను కలిసి గర్భకండ్రిగ పొలాల విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ గురువారం వెంకన్నపాలెంకు వచ్చి ఆ భూములను పరిశీలించారు. రైతుల గోడు విన్నారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తహశీల్దార్ కె.జయజయరావు, మండల సర్వేయర్ గోపీనాథ్‌రెడ్డి, సర్పంచ్ కె.మధుయాదవ్ తదితరులు ఉన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో ఇన్‌స్పిరాన్ 2025 సాంకేతిక సదస్సు




కోట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ట్రిపుల్-ఈ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఇన్‌స్పిరాన్- 2025 సాంకేతిక సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సదస్సును ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు కళాశాలల విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకోవడంతో సాంకేతికపరమైన అంశాలను చర్చించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల యాజమాన్యం ఇలాంటి సదస్సులను ఎంతగానో ప్రోత్సహిస్తుంద న్నారు. అనేక సంవత్సరాల నుంచి ఇలాంటి సాంకేతిక సదస్సులను కళాశాలలో జరుపుకుంటు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు ఎక్స్‌పో, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ పరిశోధన పత్రాలకు డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.సురేష్‌రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఐ.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోకులకృష్ణ ఫార్మశీ కాలేజిలో ప్రాంగణ ఎంపికలు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఫార్మశీ కళాశాలలో బల్క్ డ్రగ్, దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ వారిచే గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలకు 96 మంది బి-ఫార్మశీ చదివిన విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు, సీనియర్ హెచ్‌ఆర్‌లు కె.రామకృష్ణ, తిరుపతయ్యలు విద్యార్థినీ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికల నిర్వహణ ప్రక్రియ చేపట్టారు. రాతపరీక్షలు నిర్వహించి ఇందులో అర్హత సాధించిన వారికి టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్స్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం తరపున ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శివకుమార్‌లు అభినందించారు.

## వెందోటి కుటుంబాన్ని పరామర్శించిన యాచంద్ర



బాలాయపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : మండలం జయంపు గ్రామానికి చెందిన వెంకటగిరి మాజీ ఏఎంసి ఛైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి తల్లి వెందోటి సుగుణమ్మ ఇటీవల మృతి చెందడంతో వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర జయంపులోని మధుసూదన్‌రెడ్డి నివా సానికి చేరుకుని సుగుణమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెందోటి కుటుంబ సభ్యులు, జయంపు ఆయికట్టు మాజీ ప్రెసిడెంట్ వెందోటి మనోహర్‌రెడ్డి, వైయ స్సార్ కాంగ్రెస్ పార్టీ బాలాయపల్లి మండల అధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డిలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు.

## సంతకాలను పరిశీలించిన కమిషనర్



వెంకటగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ఈనెల తొమ్మిదో తేదీ వెంకటగిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నక్క భానుప్రియ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు 16మంది కౌన్సిలర్లు చేసిన సంతకాలు ప్రోజరిని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశం మేరకు కమిషనర్ వెంకటరామిరెడ్డి సంతకాల పరిశీలన చేపట్టారు. పలువురు కౌన్సిలర్లు వచ్చి కమిషనర్ ముందు మరల సంతకాలు చేశారు. 15 వార్డు కౌన్సిలర్ దొంతు శారద వచ్చి కమిషనర్ ముందు సంతకం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి, గుమ్మలకు ఢిల్లీ బాబు, పొట్టేళ్ల ప్రభావతి కమిషనర్ వద్దకు వచ్చి సంతకాలు చేశారు. కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదులో తామే సంతకాలు చేశామని కమిషనర్ ముందు తెలిపారు. ఛైర్ పర్సన్ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వైసిపి కౌన్సిలర్లు చేసిన సంతకాలు వాలివి కాదని ఫోర్జరీ వని ఎంపీ కలెక్టర్ ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. కొందరు మాత్రమే కమిషనర్ వద్దకు వచ్చి సంతకాలు చేశారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రధానం



వెంకటగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ప్రణతి సాంస్కృతిక సామాజిక సేవ సంస్థ ద్వారా శ్రీ విశ్వావసు ఉగాది శత శతక పద్యరత్న బాల పురస్కారములు అందించడం జరిగింది. నూరు శతక పద్యాలు అనర్గళంగా వల్లి వేయగలిగిన 30 మంది బాల,బాలికలకు జ్ఞాపికలు, పుస్తకములు కండువాలతో సత్కరించడం, ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి నటువంటి వెంకటగిరి వలయాధికారి ఏవి రమణ మాట్లాడుతూ నేటి సెల్ యుగంలో విద్యార్థులు ఎంతో పెడద్రోవ పడుతున్నారు. అలాగే ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ ఇంజనీర్ పోలిశెట్టి శ్రీహరి, ఓంకార్ కాసుల రోశయ్య, సేవాసమితి కోశాధికారి పుత్తా మల్లయ్య న్యాయవాది సుంకర రాజేష్, మన్నెం సుబ్బారావు, చాముండమ్మ ఆర్వీఎం పాఠశాల ఎన్సిసివిభాగం అధికారి కృష్ణయ్య నర్రా రవి, తదితరులు ప్రసంగించారు.

## వ్యాపారస్తుల వద్ద అధికంగా డబ్బులు వసూలు

వెంకటగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో స్ట్రీట్ వండర్స్ వీధి విక్రయదారుల సంఘం వీధి విక్రయదారుల కార్మికుల సమస్యలపై వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. రోడ్డు వైపు కూరగాయలు పండ్లు తోపుడు బండ్లపై వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తుల దగ్గర కాంట్రాక్టర్ అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మునేంద్ర, మున్సిపల్ యూనియన్ నాయకులు నియోజకవర్గ కార్యదర్శి కల్లూరు జాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీ కలిసిన యువరాజు సర్వజ్ఞ

బాలాయపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా వెంకటగిరి యువరాజు వైసిపి నాయకులు సర్వజ్ఞ కుమార యాచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీపీని శాలువాతో కప్పి అభినందించారు. ఎంపీపీ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

## రుణ ప్రణాళికతో జీవనోపాధి : ఏపిఎం

కోట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : స్వయం సహాయక సంఘాల రుణ ప్రణాళిక జీవనోపాధి చూపుతుందని వెలుగు ఏపిఎం అనిల అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో మూడోరోజు శిక్షణ కార్యక్రమ ంలో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవనోపాధి రుణ ప్రణాళికను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రతి యాన్యుమేటర్ ఐదు ద్వారా సంఘాల ఆర్థిక అవసరాలను గుర్తించి జీవనోపాధి ప్రణాళికను నమోదు చేయాలన్నారు. బ్యాంకు లింకేజి రుణం, పొదుపు నిల్వ చెల్లింపు, జీవనోపాధి కోసం ఎంచుకున్న రంగం వంటి వివరాలను పారదర్శకంగా సభ్యుల అభిప్రాయాలు తెలుసుకొని రుణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు, విఓఎలు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయంలో 6న శ్రీరామనవమి ఆస్థానం



తిరుమల,ఏప్రిల్ 3 ప్రభాతవార్త ప్రతినిధి: త్రేతా యుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్రమూర్తి కలి యుగంలో శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించారనే పురాణగ్రంధాల ఆధారంగా తిరుమలలో శ్రీరామ నవమి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల 6వతేదీ వెంకన్న ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం, 7న శ్రీరామపట్టాభిషేకం మహోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. 6వతేదీ ఆదివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపిస్తారు. ఇందులో పాలు, పెరుగు,తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు,చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం6.30గంటల నుండి 8గంటలవరకు హనుమంతవాహనసేవ తిరుమలలో వైభవంగా జరగనుంది. ఆ తరువాత రాత్రి 9గంటల నుంచి 10గంటలవరకు బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ రద్దయ్యింది. 7వతేదీ సోమవారం రాత్రి 8గంటల నుంచి 9గంటల వరకు బంగారువాకిలిలో ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేక ఆస్థాన మహోత్సవం వేడుకగా నిర్వహిస్తారు.

## ఘనంగా మహా శాంతి అభిషేకం



వడమాలపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: మండలంలోని అప్పలాయ గుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం సంప్రోక్షణ మహా శాంతి అభిషేకం ఘనంగా జరిగింది. గురువారం ఉదయం 8 నుంచి 11.15 గంటల వరకు యాగశ్యాలలో వాస్తు హోమం నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు జీవ ధ్వజస్తంభం మహా శాంతి అభిషేకం, పూర్ణాహుతి, అనంతరం కళాప కర్షణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో దేవరాజు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు రమణాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్వారీలో బాంబు పేలుళ్ళకి బాలుడికి తీవ్ర గాయాలు

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: గ్రానైట్ క్వారీలో బాంబులు పేల్చడంతో ఓ బాలుడికి రాయి తగిలి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి పుత్తూరు పట్టణ పరిధిలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... పుత్తూరు మున్సిపాలిటీలోని బొజ్జనత్తం ఎస్టీ కాలనీకి చెందిన రమేష్, కృష్ణంరాజు మామిడి తోటలో కాపల దరుడుగా ఉన్నాడు. రమేష్‌కి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు కలరు. కుమారుడు దినేష్ బుధవారం మధ్యాహ్నం చెట్ల కింద ఆడుకుంటుండగా క్వారీలో పిల్లలకు రాయి దినేష్‌కు తలకు తగిలి గాయమైంది. స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతి స్విమ్స్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అంగన్‌వాడీలదే



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి గురువారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మున్సిపాలిటీలోని కైకాలవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. తనిఖీల్లో భాగంగా గర్భవతులు, బాలింతలకు ఇచ్చే పోషకాహార బాలసంజీవని కిట్స్‌ను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఎంత మంది పిల్లలు ఉన్నారు అని పూర్తిరికార్డులను పరిశీలించారు. పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. పిపి1, మరియు పిపి2 పిల్లలను టైం ప్రకారం మెను భోజనం అందించాలను తెలిపారు. పిల్లలు చెప్పే కథలు, పాటలు, ఆటలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. గర్భిణీలకు, బాలింతకు అందించారు బాలసంజీవని కిట్స్ అందుతున్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి మంచి స్పందన రావడంతో అంగన్‌వాడీ టీచర్లను, ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్‌వైజర్స్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిదుర్గ, సూపర్‌వైజర్లు హరిత, ఉష, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచితంగా పాలిసెట్ నమూనా పరీక్ష

తిరుపతి విద్య, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : స్థానిక భవాని నగర్, రాజన్న పార్క్ సమీపము నందు గల శ్రీ గగన కోచింగ్ సెంటర్ నందు 05-04-2025 శనివారం ఉదయం 9 గంటలకు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్ 2025 నమూనా పరీక్ష ఉచితంగా నిర్వహిస్తున్నట్టు సమస్త డైరెక్టర్ కరుణామూర్తి తెలిపారు. సంప్రదించ వలసిన ఫోన్ నెంబర్స్ 9014052757, 9553590099

# గూడూరు డివిజన్

## నవోదయ పాఠశాలకు ఎంపికైన విద్యార్థిని



బాలాయపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెండేరి వారి పల్లి , బాలాయపల్లి మండలంలో ఐదవ తరగతి చదువుతున్న తిరుమల శెట్టివిష్ణురేఖ 2025-26 నవోదయ ప్రవేశ పరీక్ష నందు ఉత్తీర్ణత సాధించి సీటు పొందడం జరిగింది. విద్యార్థిని ఈ ఘనత సాధించుటకు సహకరించిన మన బాలయపల్లి మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ప్రదీప్ కుమార్, మన కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు తిరుమలశెట్టి వెంకటరమణయ్య, ఎస్‌టియు తిరుపతి జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు,మా పాఠశాల సహోపాధ్యాయిని భారతి, విద్యార్థిని తల్లి తండ్రులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రారంభమైన అమీషావలి దర్గా గంధమహోత్సవం

నాయుడుపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని దర్గా సెంటరులో వెలసియున్న అమీషావలి దర్గా గంధమహోత్సవం గురువారం నుండి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు దరా కమిటి సభ్యులు తెలియ జేశారు. అమీషావలి దర్గాలో గంధమహోత్సవం, శుక్రవారం రాత్రి పాటకచ్చేరి, శనివారం అన్నదానం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఇప్పటికే పట్టణంలో పాటు చుటుపక్కల గ్రామాల ప్రజలు రాకతో బజారు వీధులు కిటకిట లాడుతున్నాయి. ఉరుసు సందర్భంగా ప్రజల తాకిడి అధికంగా ఉండటంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండ నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు అదనపు బలగాలతో ప్రతిష్ట బందోబస్తూ ఏర్పాటు చేశారు.

## కౌన్సిలర్లకు విప్ జారీ



వెంకటగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ఈనెల తొమ్మిదో తేదీ వెంకటగిరి మున్సిపల్ ఛైర్ పర్సన్ నక్క భానుప్రియ పై అవిశ్వాస తీర్మానం పెట్టనుండడంతో కౌన్సిలర్లకు విప్ జారీ చేశారు. 19 మంది కౌన్సిలర్లకు మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి జారీ చేశారు. ప్రతి ఒక్కరూ పార్టీకి కట్టుబడి ఉండాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురు మల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన కౌన్సిలర్లకు తెలిపారు. పార్టీ ఇప్పుడు ధిక్కరిస్తే చర్యలు కూడా ఉంటాయని తెలిపారు. మున్సిపాలిటీలో 25 మంది కౌన్సిలర్లు వైసిపి వారే ఉండగా 6మంది చైర్పర్సన్ ను వ్యతిరేకిస్తున్నారు. మొదట 16 మంది కౌన్సిలర్లు చైర్పర్సన్‌పై అవిశ్వాస తీర్మాలు పెట్టాలని కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. మరల కొంతమంది అవిశ్వాస తీర్మానానికిమద్దతు తెలపలేదు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ భానుప్రియ, వైస్‌చైర్మన్ ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు,

## గుక్కెడునీటి కోసం... కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు

తొట్టంబేడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : ఓమహిళ గుక్కెడు నీటి కోసం కార్యాలయం చుట్టు ప్రదక్షిణలు చేస్తోంది. ప్రభుత్వం మాత్రం ఇంటింటికి కుళాయిలు ఉచితంగా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చినా, ఈ మహిళ ఇంటికి మాత్రం గుక్కెడు నీటికోసం మరో ఇంటిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం వేసవిలో తాగునీటికోసం ప్రజలు ఎవ్వరు ఇబ్బందులు పడకుండా ప్రతి ఒక్కరికి మంచినీటిని అందించాలని ఎంపిడిఓ సురేంద్రనాథ్ సంబందిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని లింగమనాయుడుపల్లికి చెందిన సుబ్బమ్మ ఉంటున్న వీధిలో గత రెండు సంవత్సరాల క్రితం సిసి రోడ్డు వేశారు పంచాయతీ అధికారులు కూడా తాగునీరు పైపులైను ఏర్పాటు చేశారు. అయితే ఇది నచ్చని కొందరు ఈమె ఇంటి ముందు ఉన్న నీటికుళాయిని విరిచేయడంతో పాటు నీటిని ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గత రెండు సంవత్సరాలుగా అటు ఎంపిడిఓ, ఇటు తహశీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారు. దీనిపై గురువారం సుబ్బమ్మ తహశీల్దార్ మధుసూధన్, ఎంపిడిఓ సురేంద్రనాథ్‌కు వినతిపత్రం ఇచ్చి తనకు న్యాయం చేయాలని కోరారు.

## గ్రానైట్ క్వారీపై చర్యలు తీసుకోవాలి

పుత్తూరురూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని ఈసలాపురం ఉన్న గ్రానైట్ క్వారీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ పుత్తూరు కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ బుధవారం జరిగిన ఈసలాపురం ఎస్టీ కాలనీకి చెందిన రమేష్ కుమారుడు దినేష్(3) మామిడి తోటలో కాపలా ఉన్నటువంటి వారిపై బాంబు పేలుళ్ళ చేయడంతో రాయి తలపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గురువారం కలెక్టర్ పుత్తూరుకు రావడంతో ఆయన దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. ఆయన స్పందించి ఆర్డీవో, తహసీల్దార్‌లను క్వారీలను పరిశీలించారు. అక్కడి ఉన్న క్వారీ మేనేజర్లతో తహసీల్దార్ మాట్లాడి మీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తనిఖీ చేసిన జడ్పీ సీఈవో

పుత్తూరురూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త: పుత్తూరు మండల పరిషత్ కార్యాల యాన్ని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు గురువారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రమేష్‌బాబుని ఆదేశించారు. అవసరమైన మేరకు తాగునీటికి సంబంధించి మెటీరియర్లు కొనుగోలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.



### "వార్త"చిత్రం

### ఆదమరిస్తే ప్రమాదమే!

నిత్యం వేలసంఖ్యలో భక్తులు, వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగించే తిరుపతి-తిరుచానూరు ప్రధాన మార్గంలో నడిరోడ్డు కుంగి మధ్యలోపెద్ద గుంతపడింది. గత మూడునెలలుగా వాహనదారులు ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. పోలీసులు బారికేడ్ పెట్టినా రాత్రిల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులూ...దీన్ని బాగుచేయాలని భక్తులు,స్థానికులు కోరుతున్నారు.

-కెఆర్ కిశోర్,ఫోటోగ్రాఫర్,తిరుపతి

## తిరుచ్చిపై రుక్మిణి, సత్యబామ సమేతంగా శ్రీకృష్ణస్వామి



తిరుచానూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో తిరుమాడ వీధులలో రుక్మిణీ, సత్యభామ సమేతంగా శ్రీకృష్ణస్వామి వారిని ఊరేగించారు. శ్రీ కృష్ణస్వామి జన్మ నక్షత్రం రోహిణి నక్షత్రము సందర్భంగా తిరిచ్చిపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా శ్వామి వారిని సుప్రభాతంతో మేలుకొలిపి సహస్రనామార్చణ నిత్యార్చణ నిర్వహించారు. సాయంత్రం వాహన మండపం వద్ద తిరిచ్చిపై స్వామి అమ్మవార్లను వేంచేపు గావించి సుందరంగ అలంకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లు తిరువీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్,ప్రసాద్,ఇన్స్పెక్టర్ చలపతి, సుభాస్కర్,ఏవియస్ఓ సతీష్ పాల్గొన్నారు.

## ఎస్వీయు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త : పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిటిషన్‌లపై ఎలా స్పందిస్తున్నారు అని జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పిటిషన్స్ విచారించడంలో జాప్యం చేయవద్దన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పిటిషన్ పై విచారించి త్వరితిగతిన న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని వివిధ కేసులు సంబంధించి వాటి స్టేటస్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో అన్ని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కే రవి మనోహర్ ఆచారి అదనపు ఎస్పీ శాంతి భద్రతలు, శ్రీలత డిఎస్పి మహిళ తిరుపతి టౌన్, సుబ్రహ్మణ్యం ఏడిసిఆర్‌బి, సాధిక్ ఆలి సీఐ స్పెషల్ బ్రాంచ్, రామయ్య సిఐ ఎస్వీయు పి.ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో సినీ హీరోయిన్ పూజాహెగ్డే

తిరుచానూరు ఏప్రిల్ 3 ప్రభాతవార్త : పద్మావతి అమ్మవారి సేవలో ప్రముఖ దక్షిణాది హీరోయిన్ పూజా హెగ్డే పాల్గొన్నారు. ఆమెకు ఆలయ సూపరిం టెండెంట్ రమేష్ దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వాద మండపం వద్ద తీర్థప్రసాదాలు అందజేసారు.

